కథ

# దుష్ట ర(శి)క్షణ

అడవిరామలక్ష్మి

పోలీసు స్టేషను అంతా 'ప్రేమపక్షు'ల సందడితో కిలకిలలాడుతున్నది. అందరూ ఇరవై ఏళ్ళలోపు వాళ్ళే. ఎవరికి తోచినది వారు చెప్తున్నారు. కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన ఇన్‌స్పెక్టర్, కాన్‌స్టేబుల్స్ సీరియస్‌గా వింటున్నారు.

సార్... మా వయస్సు పద్దెనిమిది ఏళ్ళు నిండిపోయాయి. మా కాళ్ళమీద వేము బ్రతుకగలము. మా పెద్దవాళ్ళ నుండి రక్షణ కల్పించండి... అంటూ ఓ జంట వేడుకుంటున్నారు.

మా కులాలు వేరయినా, మేము మాత్రం ఒకటిగా జీవించాలి అనుకుంటున్నాము. పెద్దలు మాత్రం 'కుల' గోడలు అడ్డు పెడుతున్నారు. వాళ్ళనుండి మమ్మల్ని కాపాడండి... అంటూ మరో జంట అర్థిస్తున్నారు.

సార్... మేము బంధువులయినా... ధనిక బీద తేడాతో తల్లిదండ్రులు విడదీస్తున్నారు. మాకు న్యాయం చేయండి... అంటూ మరో జంట ప్రాధేయపడుతున్నారు.

ఇంతలో సుడిగాలిలా ఒక అమ్మాయి దూసుకు వచ్చింది. చెరిగిన జుట్టు, మోకాళ్ళ వరకు ఉన్న చీర, గుంటకళ్ళు, వణుకుతున్న పెదవులతో సార్... నేను ఒకరికి కళ్ళు లేకుండా చేసాను. అంధుడిగా మార్చాను. నన్ను అరెస్ట్ చేయండి. జీవితంలో మరో ఆడపిల్ల వంక కన్నెత్తి చూడకుండా కళ్ళలో యాసిడ్ పోసాను... ఆవేశంగా ఇన్‌స్పెక్టర్‌కి చేసిన తప్పు వివరిస్తోంది.

కానిస్టేబుల్స్‌కి ఆ అమ్మాయి మొహం ఎప్పుడో చూసినట్టుగా... గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతలో ఆ అమ్మాయి... నేను కబోదిని చేసిన వ్యక్తి ఎవరోకాదు... నా భర్తే. పెద్దలను ఎదిరించి సరిగ్గా నెలక్రింద ఇదే స్టేషనులో పెళ్ళిచేసుకున్న భర్త. అందరి ఆప్యాయతలను కాలరాచి అతనే సర్వస్వము అనుకొన్న భర్త... ఆయాసంతో కళ్ళు మూతలు పడుతుంటే బెంచి మీదకు ఒరిగిపోయింది.

విషయం విన్న తల్లిదండ్రులు పోలీసు స్టేషనుకు చేరుకున్నారు. వారిని చూడగానే కాన్‌స్టేబుల్స్‌కు నెలరోజుల క్రితం నందిని అనే అమ్మాయి, ఆటోడ్రైవరుతో కలిసివచ్చి తండ్రిమీద ఫిర్యాదు ఇవ్వడం గుర్తుకు వచ్చింది.

ఇన్‌స్పెక్టరు నందిని గురించి తండ్రిని అడిగాడు. నా పేరు వెంకట్రావు. నందిని నాకు ఏకైక సంతానము. చాలా గారాబంగా పెంచాను. మధ్యతరగతే అయినా అడిగినది ఏనాడూ కాదనలేదు. అందరి ఆప్యాయతల మధ్య అపురూపంగా పెరిగిన పుత్తడిబొమ్మ నందిని.

ఇంటర్ పూర్తవగానే ఇంజనీరింగ్ కాలేజీలో చేరినది. శక్తికి మించిన చదువే అయినా నందిని అడిగిందని రాజీపడలేదు. పిల్లలకు మనము ఇచ్చే ఆస్థి చదువే అని సిద్ధపడ్డాను.

మొదటి సంవత్సరము మంచి మార్కులతోనే పాస్ అయింది. రెండవ సంవత్సరము వచ్చేసరికి నాకు ట్రాన్స్‌ఫర్ అయి పక్క ఊరికి రోజూ వెళ్ళి వచ్చేవాడిని. నందినికి ఇబ్బంది అని ఆటో ఏర్పాటు చేసాను. రోజూ ఆటోలో కాలేజీకి వెళ్ళి వచ్చేది. నేను చేసిన తప్పుపని కుర్రడ్రైవర్‌ని పెట్టడమే కానీ నా కూతురుమీద ఉన్న నమ్మకం నా ఆలోచనని ముందుకు సాగనీయలేదు. నా కూతురు నన్ను మోసం చేస్తుందని కలలో కూడా ఊహించలేదు సార్.. భోరుమన్నాడు వెంకట్రావు.

అప్పటికే కాస్త తేరుకున్న నందిని, నాన్నా.. మీరు ఆగండి. తర్వాత కథ నేను చెప్తాను. నా జీవితం వీళ్ళందరికి కనువిప్పు కావాలి. వారిలో పరివర్తన రావాలి. ప్రేమ అనేది కేవలము ఆకర్షణ కారాదు. ఎదిగిన వయస్సులో, అవగాహన రూపమే ప్రేమ. తమకాళ్ళ మీద తాము నిలబడాలి. ఒకరిని ఒకరు తీర్చిదిద్దుకోడానికి సమయం తీసుకోవాలి. ఇరువైపుల వారిని ఒప్పించగలగాలి. అంతేగానీ, సినిమాలోలా పాలవాడిని, పేపర్‌వాడిని, మెకానిక్‌ని తొలిచూపులో ప్రేమించి మరుసటి రోజు పెళ్ళి చేసుకుంటే నాలాగే అభాగినులవుతారు.

ఓ ఆదివారం నాడు సినిమాకి వెళ్దామని నాన్నని అడిగాను. టిక్కెట్లు దొరకవు... అయినా ఆఫీసులో అర్జెంటుపని ఉందంటూ సాయంత్రమే ఊరెళ్ళిపోయారు. వెళుతూ... తెలిసిన ఆటో కదా... మోహన్‌ని పిలిచి అమ్మ, నువ్వు వెళ్ళండి... అన్నారు. మోహన్‌కి ఫోన్ చేసి, టిక్కెట్లు గురించి అడగగానే ఎగిరి గంతేసి తీసుకు వచ్చాడు. మా టిక్కెట్లతో పాటు తనకు కూడా తెచ్చుకున్నాడు. మా మొదటి పరిచయం సినిమా చూస్తూ జరిగింది.

కాలేజీ ఫంక్షన్‌లో మరోసారి లేటయింది. హోరున వాన... ఒక్క ఆటో లేదు. చీకట్లు ముసురుకుంటున్నాయి. నాన్న పక్క ఊరి నుండి రావడానికి కూడా బస్సులు లేవట. అమ్మ

కంగారు పడుతూ ఫోన్ చేసింది. అప్పుడే కనిపించాడు మోహన్. మోకాలిలోతు నీటిలో ఆటోను తోసుకువస్తున్నాడు. చాలా ఆనందం వేసింది. థ్యాంక్స్... అన్నాను. నాలో ప్రేమకి తొలిసారిగా బీజం పడింది. అమ్మ వేడి వేడి టీ ఇచ్చింది. ఇంట్లోకూడా అనుమానం లేకపోవడంతో, ఒంటరిగా ఉన్నప్పుడు మోహన్ 'నందని' పేరును 'నందూ'గా పిలిచేవాడు.

కాలేజికని బయలుదేరడం... సినిమాలు, షికార్లు తిరిగే వాళ్ళం. చూసిన సినిమాలలోని కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసేవాళ్ళము. భవిష్యత్తు గురించి ఆలోచనే లేదు. సహజంగా మోహన్ బొమ్మలు బాగా గీసేవాడు. రోజుకి ఒక కొత్త భంగిమలో, నా రూపాన్ని బొమ్మగా గీసేవాడు. నా అందాన్ని, నేనే ఆ బొమ్మలలో మైమరచి చూసుకునే దాన్ని.

అతని తియ్యని మాటలు, నన్ను ఏవో లోకాల్లో విహరింపజేసేవి. చదువు మీద ధ్యాస తగ్గిపోయింది. కాలేజికి మీ అమ్మాయి సరిగా రావడం లేదని నాన్నకి, ప్రిన్సిపాల్ ఫోన్ చేసారు. అమ్మ నాన్నలకి విషయం తెలిసి గగ్గోలు పెట్టారు.

ముక్కుపచ్చలారని వయసులో నీకు మాయ మాటలు చెప్పి వంచించాడని, బాధ్యతలు తెలియని వయస్సని, చదువుపూర్తి అయ్యాక పెళ్ళి చేసుకోవచ్చని... ఎంతగానో నచ్చజెప్పారు నాన్న. కానీ నేను వినలేదు. ఇంకా లేట్ అయితే మరింత ప్రమాదమని, ఓ రోజు నగలు, డబ్బు పట్టుకొని వెళ్ళి, మోహన్‌కి ఇచ్చాను. మరునాడు గుళ్ళో పెళ్ళి చేసుకొని, ఇలాగే పోలీసు స్టేషనుకి వచ్చి పెద్దల నుండి రక్షణ కల్పించండంటూ వేడుకొన్నాము. చేసేదిలేక అమ్మ నాన్న నా కర్మకి నన్ను వదిలి వెళ్ళారు.

డబ్బులు ఉన్న నాల్రోజులు సినిమాల్లో లాగా మా కొత్తకాపురం సాగింది. డబ్బు అయిపోగానే ఊరిచివరకు మా మకాం మార్చేసాడు మోహన్. మురికిగుంటలు, చెత్తకువ్వలు, టెంటులో సంసారం మొదలయింది. మొదటిసారిగా 'ప్రేమ' రూపం తెలిసింది. ఎంత మోసపోయినదీ తెలిసి వెక్కి వెక్కి ఏడ్చాను. మోహన్ 'వ్యసనపరుడు' అయినా మార్చుకోడానికి ప్రయత్నిద్దాము అనుకున్నాను.

టీచరుగా స్కూలులో జాయిన్ అయాను. డబ్బులు వస్తాయని మోహన్ ఊ... అన్నాడు. రోజులు గడుస్తున్నాయి. స్కూలులో స్టూడెంట్స్ నోట్సులుకరెక్టు చేస్తుంటే, ఓ పాప నోట్సులోంచి కాగితం పడింది. ఆ పేపర్‌మీద మోహన్ వేసే గీతలనే పోలిఉన్న, ఆ పాప బొమ్మ ఉంది. గుండె దడ దడలాడింది. ఎన్నో అనుమానాలు పొడసూపాయి.

సాయంత్రం స్కూలు పక్కనే మాటువేసి చూసాను మోహన్ ఆటోలోనే ఆ పాప ఎక్కింది. మరొక బొమ్మ వేసిన పేపర్ ఇచ్చాడు. ఆ పాప మోహన్‌ని ముద్దు పెట్టుకుంది. కాళ్ళు చేతులు వణకనారంభించాయి. మోహన్ వక్రబుద్ధి అర్థమయింది. నాలాగా మరో పువ్వు వాడిపోకూడదు అని నిర్ణయించుకున్నాను. స్కూలునుండి వచ్చేటప్పుడే యాసిడ్‌బాటిల్ కొని తెచ్చాను. ఆ రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత మోహన్ ఇంటికి వచ్చాడు. నేను పాప గురించి అడిగేసరికి తాగిన మైకంలో రేపే పెళ్ళి చేసుకుంటున్నాము... అన్నట్టు చెప్పాడు. కళ్ళు ఉండబట్టే కదా... ఈ త్రాష్టుడు అన్నీ చూడగలగుతున్నాడు. గాంధీగారు మంచిని చూస్తూ, చెడు కనిపించినప్పుడు కళ్ళు మూసుకోమన్నారు. కానీ ఈ నీచుడు మంచిని కూడా చెడుగానే చూస్తున్నాడు. ఇలాంటి వాడికి కళ్ళే అనవసరం అనుకున్నాను.

ఇలాంటి మృగానికి, విధించే 'శిక్ష'తో జీవితాంతం కుళ్ళి కుళ్ళి ఏడవాలి అనుకొని... కళ్ళలో యాసిడ్ పోసాను. మోహన్ బాధతో అరుస్తూ ఉంటే... నాకు ఎంతో సంతోషం కలిగింది. ఎందరో చిన్నారుల ప్రాణాలను కాపాడినట్టనిపించింది.

తెలిసో, తెలియకో వయస్సు ఆకర్షణలో నేను కూడా తప్పు చేసాను. కాబట్టి మోహన్‌ని కనిపెట్టుకొని ఉండడమే నాకు నేను విధించుకున్న శిక్ష. నేను చేసిన పనికి మీరు ప్రస్తుతం ఏ శిక్ష విధించినా రడీగానే ఉన్నాను సార్... అంటూ నందిని ఇన్‌స్పెక్టర్ వైపు చూసింది.

ఈ కథంతా విన్న ప్రేమికులు, 'ఒక్కరొక్కరూ పరిపక్వత పొందాక కలుసుకుందాము'... అన్నట్టు స్టేషను నుండి నిష్క్రమించారు.

పోలీసులు మోహన్‌ని స్టేషనుకు తీసుకువచ్చారు. చేసిన తప్పుని ఒప్పుకున్నాడు. ఇరువురికి నామమాత్రపు శిక్ష పడింది.

పదేళ్ళ తర్వాత... ఆర్ట్ గ్యాలరీ ప్రారంభించడానికి డి.ఐ.జి వచ్చారు. గుర్తుపట్టిన ప్రొఫెసర్ తన భర్తను పరిచయం చేసింది. ఆ భర్తే 'అంధుడైన చిత్రకారుడు' ప్రేమించడమే కాదు... దండించి భర్తను మార్చుకున్న ప్రొఫెసర్ నందినిని డి.ఐ.జి అభినందించారు.

## చినుకులు

1. చిత్రకారుడు కూడా సైంటిస్ట్ లాంటివాడే

   **- లియోనార్డ్ డావెన్సీ**

2. దేవతలువెళ్ళుటకు భయపడే చోట మూర్ఖులు ధైర్యంగా వెళ్లిపోతారు

   **- పోప్**

3. ధైర్యానికి అదృష్టం తోడవ్వాలి

   **- వర్జిల్**

4. వేలమైళ్ళ దూరాన్ని ఒక్క అడుగుతోనే ప్రారంభిస్తారు

   **- లావోస్**

5. నైతికంగా దిగజార్చడంలో డబ్బుకు మించింది మరొకటిలేదు.

   **- సోఫోక్లీస్**

సేకరణ:
మహమ్మద్‌ఖాన్